

# టెంపరేచర్@44.3°

- కొత్తకోటలో అత్యధికంగా నమోదు
- ఉష్ణతాపంతో ప్రజల బెంబేలు

వనపర్తి, ఏప్రిల్ 7 : వనపర్తి జిల్లాలో ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతున్నది. అన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా 2నుంచి 3 డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 7నుంచి సాయంత్రం 6 గంటల వరకు భానుడి తాపం కొనసాగుతుంది. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మారిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో రోజురోజుకూ వేడితోపాటు ఉక్కపోత పెరుగుతున్నది. జిల్లాలో 44 డిగ్రీలు దాటింది. ఈ క్రమంలో కొత్తకోటలో 44.3 డిగ్రీలు రికార్డు స్థాయిలో నమోదు కాగా పెబ్బేరులో 44.1, వీపనగండ్లలో 41.8, ఆత్మకూర్‌లో 42.5, పానగల్‌లో 42.4, గోపాల్ పేటలో 42.1, శ్రీరంగపురంలో 42.1, అమరచింతలో 42.0, ఖిల్లా ఘణపురంలో 41.9, పెద్దమందడిలో 41.8, రేవల్లిలో 40.7, వనపర్తిలో 40.7, చిన్నంబావిలో 43.2, మదనాపురంలో 42.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్ ప్రారంభంలోనే ఇలా ఉంటే మే నాటికి పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఎండ, వడగాలి, ఉక్కపోత ఉండగా , రాత్రి సమయానికి చల్లబడుతున్నది. వాతావరణంలో భిన్నమైన పరిస్థితులు నెలకొనడంతో ప్రజారోగ్యం పై ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

# ఆర్‌ఎస్‌పీ గెలుపునకు కృషి చేయాలి

- అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్ నేతలు
- హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న సర్కారు
- ప్రజలు మళ్లీ ఓటు వేసి మోసపోయేందుకు సిద్ధంగా లేరు
- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి
- నాగర్‌కర్నూల్‌లో యువత, సోషల్ మీడియా సభ్యుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న యువత, సోషల్ మీడియా సభ్యులు




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 7: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి మన బీఆర్‌ఎస్ తరఫున బరిలో ఉన్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్(ఆర్‌ఎస్‌పీ) గెలుపునకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కోరారు. ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ యువజన-సోషల్ మీడియా సభ్యుల సమావేశానికి హాజరై దిశానిర్దేశం చేశారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ పార్లమెంట్‌లో బల్లలు గుద్దే వాళ్లు కావాలా, ప్రశ్నించే వాళ్లు కావాలా ఒకసారి ఆలోచించుకోవాలని సూచించారు. పార్లమెంట్‌లో మన బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగరేసేందుకు ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్‌లో గెలిచేది కేవలం బీఆర్‌ఎస్ పార్టీయేనని, రాబోయే ఎన్నికల్లో యువకులందరూ కష్టపడి పనిచేయాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలతో కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేస్తున్న మోసాలను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ తప్పుడు నిర్ణయాలను ప్రజలకు వివరించాలన్నారు. యువకులను, మన సోషల్ మీడియా సభ్యులను పోలీస్ అధికారులు ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే సహించమన్నారు. తెలంగాణలో ఈ రోజు రైతులు చాలా కష్టాల్లో ఉన్నారని, టైంకు కరెంట్, సాగునీరు లేక పంటలు ఎండిపోయి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు, రైతులు మార్పు కోరుకుంటున్నారని, వాళ్ల జీవితాల్లో మార్పులు వస్తాయని రైతులు అనుకోలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ఊపు తగ్గిందని, అరచేతిలో వైకుంఠం చూపించి హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు ఓట్లు వేసే పరిస్థితి లేదన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని బాండ్ పేపర్ రాసిచ్చి మరీ మోసం చేశారని, వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు ఎన్నికల కోడ్ అడ్డంగా పెట్టుకుంటున్నారని, వంద రోజుల తర్వాతే కోడ్ వచ్చిందనేది గుర్తించుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటోందని, వీటిపై పార్లమెంట్‌లో ప్రశ్నించాలంటే బీఆర్‌ఎస్‌కు బలమివ్వాలని, అందుకు ప్రశ్నించే గొంతును గెలిపించంచాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి కోసం కష్టపడిన బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని అభ్యర్థించారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిని, పథకాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. నీళ్లు రావడం లేదు, కేసీఆర్ కిట్ అందడం లేదు. అన్ని వర్గాలను కాంగ్రెస్ కష్టాలపాలు చేసిందన్నారు. బీజేపీ పాలనలో గ్యాస్, పెట్రోల్ ధరలు పెరిగాయని ఆ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని, కాంగ్రెస్, బీజేపీ దొందూదొందేనని, దేవుడితో పేరుతో రాజకీయాలు చేయడం కాదు, చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని సూచించారు. కార్యకర్తలు భయపడాల్సిన పనిలేదని, అవసరమైతే మా ప్రాణాలను అడ్డుపెట్టి కాపాడుకుంటామన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని యువజన విభాగం నాయకులు, సోషల్ మీడియా సభ్యులున్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా..

- మాజీఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం, ఏప్రిల్ 7 : బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టత కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని దేవరకద్ర మాజీ ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కొన్నూరు గ్రామంలో దేవరకద్ర నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జయంతి నివాసంలో ఏర్పాటు చేసిన గ్రామస్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ ఆపద సమయంలో పార్టీ కోసం నిలబడ్డ కార్యకర్తలే తనకు ముఖ్యమని, నాయకులు వస్తూ పోతూ ఉంటారని అలాంటి వారిని పట్టించుకోవాల్సిన అవసరం మనకు లేదన్నారు. అందరూ తనవాళ్లే అని నమ్మి తప్పుచేశానని, పదవులు అనుభవించి, పార్టీ ఓటమి పాలుకావడంతో, తమ ఉనికి కోసం ఇతర పార్టీలకు వెళ్లడం జీర్ణించుకోలేకపోతున్నానని అన్నారు. ఇకపై పార్టీ కోసం నిలబడిన వారికే తొలిప్రాధాన్యత ఉంటుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తాచాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన సీనియర్ కార్యకర్త తిమ్మన్న ఇటీవలే మృతి చెందగా విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. తిమ్మన్న కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన రైతు బంధు పథకం ద్వారా తమ ఖాతాలో రూ.5లక్షలు జమ అయ్యాయని, జీవితాంతం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అచ్యుతారెడ్డి, అర్చన, శ్రావణి, శారద, మహేశ్, మాసన్న, విజయేందర్‌రెడ్డి, రవికుమార్ మురళి, గోవర్ధన్, నర్సింహ, గాంధీనాయక్ పాల్గొన్నారు.

## గన్ మిస్‌ఫైర్.. ఏఆర్ ఎస్సై మృతి



బాలేశ్వర్ (ఫైల్)

ఎర్రవల్లి చౌరస్తా, ఏప్రిల్ 7 : గన్ మిస్‌ఫైర్ కావడంతో పదో పటాలానికి చెందిన ఏఆర్ ఎస్సై బాలేశ్వర్ మృతి చెందిన ఘటన ఆదివారం హైదరాబాద్‌లోని హుస్సేనీ ఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. హైదరాబాద్‌లోని హుస్సేనీ ఆలం సెక్టర్-2 ఎస్సై నర్సింహ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హుస్సేనీ ఆలం పీఎస్‌కు అటాచ్‌మెంట్‌కు వచ్చి విధులు నిర్వహిస్తున్న ఏఆర్ ఎస్సై బాలేశ్వర్ ఆదివారం తెల్లవారుజామున 5: 20 గంటల ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఎస్‌ఎల్‌ఆర్ గన్ మిస్‌ఫైర్ కావడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బాలేశ్వర్‌ను ఓజీహెచ్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఎస్‌ఎల్‌ఆర్ గన్ మిస్‌ఫైర్ కావడంతో ఏఆర్ ఎస్సై బాలేశ్వర్ మృతి చెందినట్లు పేర్కొన్నారు. బాలేశ్వర్‌కు భార్య, ఒక కూతురు, కొడుకు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# నల్లమలలో కార్చిచ్చు

- మంటలను అదుపుచేసిన అటవీశాఖ సిబ్బంది



అమ్రాబాద్ గుండం దగ్గర మంటలార్పిన సిబ్బందితో అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడి

అమ్రాబాద్, ఏప్రిల్ 7 : అమ్రాబాద్ మండలం నల్లమల అటవీ ప్రాంతంలో మన్ననూర్ పడమర బీట్ తాళ్లచెల్క, గుండం ఏరియాలో అకస్మాత్తుగా శనివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది అర్ధరాత్రి రెండు గంటల వరకు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులో కి తీసుకొచ్చారు. అటవీశాఖ జిల్లా అధికారి రోహిత్ గోపిడికి సమాచారం అందించగా, అమ్రాబాద్, మన్ననూర్ అటవీశాఖ అధికారులు ఆదిత్య, ఈశ్వర్ బీట్ అధికారులు క్యాంప్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అటవీ ప్రాంతంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హిందూపూర్‌లో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ

# పచ్చని పొలాల్లో.. ఇథనాల్ చిచ్చు

- హిందూపూర్ శివారులో పరిశ్రమ ఏర్పాటుపై రైతుల అభ్యంతరం
- పరిశ్రమ పనులను నిలిపి వేయాలని అధికారులకు వినతి
- లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక

ఊట్కూర్, (కృష్ణ) ఏప్రిల్ 7 : నారాయణపేట జిల్లా కృష్ణానది పరివాహక ప్రాంతం హిందూపూర్ శివారులోని పచ్చని పొలాల్లో ఏర్పాటవుతున్న ఇథనాల్ పరిశ్రమపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ ఏర్పాటైతే ప్రజల ఆరోగ్యానికి, పంట పొలాలకు, పర్యావరణానికి ముప్పు పొంచి ఉన్నదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కృష్ణ మండలంలోని హిందూపూర్ శివారులోని 2010, 2011 సర్వే నెంబర్లలో రైతుల వద్ద కొనుగోలు చేసిన 24 ఎకరాల వ్యవసాయ భూమిలో ఇథనాల్ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు దేవ్‌శ్రిష్టి బయో ఫ్యూయెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కేంద్ర ప్రభుత్వం ద్వారా అనుమతి పొందింది. పరిశ్రమ నిర్మాణానికి ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లిమిటెడ్ (ఐఆర్‌ఈడీఏ) నిధులు మంజూరు చేయగా రూ.200 కోట్ల వ్యయంతో ఏడాది కిందట పనులను ప్రారంభించారు. ఈ విషయం రైతులకు ఆలస్యంగా తెలియడంతో ఫ్యాక్టరీ ద్వారా వెలువడే కాలుష్యం తమ ఆరోగ్యాలపై ప్రభావం చూపడమే కాకుండా పంట పొలాలకు నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు దశాబ్దాల కిందట ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఎత్తిపోతల పథకం ద్వారా హిందూపూర్, గుడెబల్లూర్, కున్సీ గ్రామాలకు సంబంధించిన 36 వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం ఏర్పడింది. దీని ద్వారా రైతులు ఏటా రెండు పంటలు పండిస్తున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి దేవ్‌శ్రిష్టి బయో ఫ్యూయెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే అరవైశాతం పూర్తి చేయగా మరో నాలుగు నెలల్లో ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు పనులు చకచకా సాగుతున్నాయి. కాగా, పంట పొలాలనే నమ్ముకొని జీవిస్తున్న గుడెబల్లూరు, హిందూపూర్ సరిహద్దు శివారులో ఓ సంస్థ ఇథనాల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం రైతుల వ్యతిరేకతకు కారణమవుతున్నది. పచ్చని తమ పొలాల మధ్య ఫ్యాక్టరీని ఏర్పాటు చేయొద్దంటూ ఇప్పటికే రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నారు. గతంలో పక్కనే కృష్ణమ్మ ప్రవహిస్తున్న తమ పంట పొలాలకు చుక్క నీరు ఉండేది కాదని, సాగునీటి సౌకర్యం లేక పొలాలు బీళ్లుగా వదిలి బతుకు దెరువు కోసం వలస వెళ్లిన వెనుకటి రోజులను స్థానిక రైతులు తిరిగి గుర్తుకు తెచ్చుకుంటున్నారు. తమ పొలాల మధ్య ఫ్యాక్టరీని తరలించేందుకు కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని వేడుకుంటున్నారు. ఇదే విషయమై ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని ప్రశ్నించగా తమది పూర్తిగా జీరో పొల్యూషన్ ఫ్యాక్టరీ అని, ఇథనాల్ పరిశ్రమ ద్వారా ఎలాంటి వ్యర్థ పదార్థాలు బయటికి వెలువడవన్నారు. వరి, గోధుమ, మొక్కజొన్న పంటలను బాయిలింగ్ చేసి ఆవిరిని స్టోరేజ్ చేస్తామని వెల్లడించారు. దీని వల్ల వాయు కాలుష్యం కూడా ఉండదని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని చెబుతున్నారు.



ఇథనాల్ పరిశ్రమ వద్దంటూ కృష్ణ తాసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు(ఫైల్)

## పంట పొలాలకు నష్టం



ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుతో పంట పొలాలకు నష్టం జరుగుతున్నది. ఫ్యాక్టరీకి లిఫ్ట్ పక్క నుంచి నీటిని తరలిస్తే లిఫ్ట్ కింద పంటలకు నీరు ఎట్లా అందుతున్నది. ఇప్పటికే నదికి అవతలి వైపున ఉన్న కర్ణాటకలోని శక్తినగర్, ఎర్రమొరస్ థర్మల్ పవర్‌ప్లాంట్, మైసూర్ కెమికల్ ఫ్యాక్టరీలకు ఎగువ వైపునుంచి ఇష్టానుసారంగా నీటిని తరలిస్తున్నారు. దీంతో లిఫ్ట్ కింది పంటలకు సాగు నీరు అందడం లేదు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే తక్షణమే జోక్యం చేసుకుని మా సమస్యను పరిష్కరించాలి. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తాం.

– కొంకలి వెంకటేశ్, ఎంపీటీసీ, గుడెబల్లూర్

## పరిశ్రమ ఏర్పాటుతో కాలుష్యం



పచ్చని పంట పైర్ల నడుమ పరిశ్రమను ఏర్పాటు చేస్తే కాలుష్యం పెరిగి ప్రజలకు అనారోగ్యంతోపాటు పశు సంపద కూడా క్షీణిస్తుంది. నదీ జలాలు కలుషితమై వ్యవసాయం పూర్తి గా నాశనం అవుతుంది. నీరు, గాలి కలుషితమై తే మా ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. అందుకే ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మించొద్దని కోరుతున్నాం.

– వెంకటేశ్, రైతు, గుడెబల్లూర్

## నీటి కోసం ఏకంగా కృష్ణానదికే గండి



కృష్ణానది నుంచి పరిశ్రమ వరకు తీసిన గండి

కృష్ణ మండలంలోని హిందూపూర్ వద్ద ఏర్పాటవుతున్న ఇథనాల్ పరిశ్రమకు కృష్ణానది నుంచి 0.2 నీటిని తరలించనున్నారు. యాజమాన్యం నీటిని తరలించేందుకు అనుమతులు పొందకుండానే కృష్ణానది నుంచి ఫ్యాక్టరీ వరకు కెనాల్ తవ్వకం ప్రారంభించారు. గుర్తించిన రైతులు పనులను అడ్డుకొని కృష్ణ తాసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ఎగువ భాగంలో కెనాల్ తవ్వకం చేపడితే పంట పొలాలకు సాగునీటి ఇబ్బందులు వస్తాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఎత్తిపోతల పథకానికి సాగునీరందడం ప్రశ్నార్థకమవుతుందని మూడు గ్రామాల రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

# ఉన్నత విద్యకు బాటలు

- పీయూలో ఇంజినీరింగ్, లా కళాశాలల ఏర్పాటుకు అడుగులు
- ప్రతిపాదనలు పంపాలని కోరిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి
- భవనాలు, సిబ్బంది నియామకంపై నివేదిక ఇవ్వనున్న అధికారులు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతుల ప్రారంభానికి చర్యలు
- ఉపాధి, ఉద్యోగ ఆధారిత కోర్సులకు ప్రాధాన్యత




పాలమూరు యూనివర్సిటీ ముఖద్వారం

పాలమూరు, ఏప్రిల్ 7 : పాలమూరు విశ్వవిద్యాలయం అంచెలంచెలుగా ఎదుగుతున్నది. సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలతోనే ప్రారంభమైన యూనివర్సిటీ క్రమంగా పలు రకాల కోర్సులతో ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నది. ప్రస్తుతం పీయూ సిగలో ఉపాధి, ఉద్యోగ కోర్సులైన ఇంజినీరింగ్, లా కళాశాల ఏర్పాటుకు అడుగులు పడుతుండడంతో పాలమూరు ఎడ్యుకేషన్ హబ్‌గా మారనున్నది. ఈ మేరకు ఆయా కళాశాలల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నుంచి పీయూ అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో రెండు కళాశాలల ఏర్పాటు కల త్వరలోనే సాకారం కాబోతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వం లా, ఇంజినీరింగ్ కళాశాలలు లేకపోవడంతో వాటిని ఏర్పాటు చేయాలని కొన్ని రోజులుగా పీయూలోని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేయడంతోపాటు పలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా పలువురు ప్రజాప్రతినిధులకు కూడా వినతిపత్రాలు అందజేశారు. మొదట ఇంజినీరింగ్ కళాశాలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించినప్పటికీ విద్యార్థి సంఘాల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు పీయూలో ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు కళాశాలల ఏర్పాటుకు దాదాపు రూ.150 నుంచి రూ.200 కోట్ల వరకు ప్రతిపాదనలు పంపేందుకు అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారు.

**ఇప్పటికే బార్ కౌన్సిల్ అనుమతులు..**

ప్రభుత్వం నుంచి లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుకు సంకేతాలు రావడంతో అందుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు రూపొందిస్తున్నారు. మొదట రెండు కళాశాలలకు భవనాలు అవసరమవుతాయి. లా కళాశాలలో కేవలం ఒక్క కోర్సు మాత్రమే ఉండగా, ఇందుకు సంబంధించి ఇప్పటికే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి డిపార్ట్‌మెంట్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. ఇక ఇంజినీరింగ్‌లో పలు కోర్సుల తరగతుల నిర్వహణకు గదులు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వీటితోపాటు రెండు కళాశాలల్లో పనిచేసేందుకు టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించాల్సి ఉన్నది. వీరికి చెల్లించే వేతనాలు, ఇతర ఖర్చుల పూర్తి వివరాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. వివరాలన్నింటినీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి పీయూ అధికారులు త్వరలో నివేదిక అందించనున్నారు.

## ఇంజినీరింగ్‌లో 4 నుంచి 6 కోర్సులు

లా కోర్సుకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉండగా ఉమ్మడి జిల్లాలో ఒక్క ప్రైవేట్ కళాశాలలో మినహా ఎక్కడా ఆ కోర్సు లేదు. ఇంజినీరింగ్‌తో పాటు డాటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్, మెషిన్ లర్నింగ్ తదితర డిమాండ్ ఉన్న కోర్సుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించనున్నట్లు సమాచారం. సూమారు 4 నుంచి 6 కోర్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తుంది. విద్యార్థుల చదువులు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు వచ్చేలా డిమాండ్ ఉన్న వాటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రభుత్వ ఆదేశాలు వచ్చేశాయ్



పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వాటికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. రెండు కళాశాల వస్తే ఉమ్మడి పాలమూరు విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. పీయూలో లా కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి విద్యార్థుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు.

– లక్ష్మీకాంత్‌రాథోడ్, పీయూ, ఉపకులపతి

## విద్యార్థులకు ఎంతో మేలు



పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటు కోసం ప్రభుత్వ కోరిన వివరాలను త్వరలోనే సమర్పిస్తాం. పూర్తి స్థాయి వసతులతోపాటు రెగ్యులర్ ప్రతిపాదికన సిబ్బంది నియమించాలని కోరుతాం. కళాశాలల ఏర్పాటు చేస్తే ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది. ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే కష్టాలు తప్పుతాయి.

– మధుసూదన్‌రెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, పాలమూరు యూనివర్సిటీ

# ఎండుతున్న పంటలు

- ఇబ్బందులు పడుతున్న రైతులు



మమ్మాయిపల్లి శివారులో వాడుబారుతున్న వరి

బిజినేపల్లి ఏప్రిల్ 7: మండలంలోని ఆయా గ్రామాలు, తండాల్లో యాసంగిలో వేసిన వరి పంటలకు సాగునీరందక ఎండిపోతున్నాయి. పెట్టుబడి రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో రైతులు పంటలు పండించుకోవడానికి పుష్కలంగా నీరు దొరికేదని చెబుతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో సాగునీరు అందక రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా రైతులు యాసంగిలో మొక్కజొన్న, వేరుశనగ, వరి పంటలను సాగు చేశారు. పంటలు కోతకు వచ్చే దశలో నీరు సక్రమంగా అందక వేసిన పంటలన్నీ ఎండుతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు ఎండిపోతుంటే, బోరుబావులు, ట్యాంకర్లు తదితర ప్రత్యామ్నాయాల ద్వారా తడులు అందించి పంటలు కాపాడుకునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో సర్వే నిర్వహించి పంటలు నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.



సన్నగా పోస్తున్న బోరు